# సుదర్శన

మనువంశ రాజైన దుర్యోధనుడు, అతని భార్య నర్మద ఒకరి పట్ల ఒకరు బద్ధానురాగులై ఆదర్శమైన దంపతులుగా పేరుగాంచారు. దుర్యోధనుడు రాజకార్య నిర్వహణలో ధర్మప్రభువుగా కీర్తి పొందాడు.

ఆ దంపతుల ఏకైక పుత్రిక సుదర్శన. గారాల పట్టి అయినప్పటికీ, విధి నిర్వహణలో మంచి శిక్షణ ఇచ్చారా దంపతులు ఆమెకు పసితనంనుంచీ.

దుర్యోధన మహారాజు బహునిష్ఠాపరుడు. నిత్యాగ్నిహోత్రి. వర్ణాశ్రమ ధర్మ సంరక్షకుడు. తను ఆచరిస్తున్న ధర్మాలన్నీ సుదర్శన కూడా ఆకళింపు చేసుకోవాలని అతను క్షణక్షణం ప్రయత్నం చేస్తూండేవాడు. తను నిర్వహించే దైవసంబంధమైన కార్యక్రమాల్లో సుదర్శనకు ఎక్కువ బాధ్యత అప్పగించేవాడు.

సుదర్శనకు అప్పగించిన బాధ్యతలలో ముఖ్యమైనవి అగ్నిగృహాన్ని పరిశుభ్రపరచటం, అలంకరించటం, అగ్నిదేవుని ఆవాహనం చేయటానికి కావలసిన వస్తుసామగ్రిని సంసిద్ధం చేయటం మొదలైనవి. సుదర్శన అగ్నిగృహ సంబంధ కార్యాలూ బహుశ్రద్ధగా చేస్తూ, తండ్రి నిత్యానుష్ఠానానికి ఏ లోటూ రానీయకుండా చూసుకుంటోంది.

ప్రతి నిత్యమూ అగ్నిగృహంలో ప్రవేశించే సుదర్శన అగ్నిదేవుని గూర్చి తలపోయసాగింది ఆనాడు. ధర్మప్రభువులు, మహర్షులు అంతా నిత్యం అగ్నిని సేవిస్తున్నారంటే, అతనిలోని గొప్పతనమేమిటో అని విస్తుపోయేది ఒక్కొక్కసారి. ఆ అగ్నిపైన భక్తి గౌరవాలు సుదర్శనకు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దేవతలకు అర్పించే నైవేద్యాలు అగ్నిదేవునిద్వారా వారికి చెందుతున్నాయని తెలిసిన సుదర్శన అగ్నిగృహ నిర్వహణలో మరీ ఎక్కువ శ్రద్ధ వహించటం మొదలు పెట్టింది.

సుదర్శన కనబరిచే భక్తిశ్రద్ధలు అగ్నికి ముచ్చట గొలిపాయి. నవయౌవనంలో అడుగుపెడుతున్న సుదర్శనను నిత్యం గమనిస్తున్నాడు. గృహాలంకరణ సమయంలో సుదర్శన చిగురుటాకుల్లా ఉన్న చేతుల సొంపును పరీ

క్షగా తిలకిస్తున్నాడు. అగ్నిని రాజేస్తుంటే ఆమె కనులలోని అరుణిమ అతనికి ఎంతో ఆకర్షణీయంగా కనిపించేది. ఆమె అడుగుల చిరుసవ్వడి అతని మనసుకి మన్మథరాగాలాపమైంది.

సుదర్శన రాకకోసం నిత్యం ఎదురుచూడటం అగ్నిహోత్రునికి పరిపాటి అయింది. ఆమె ముగ్ధమనోహరత్వం అతని మనసుని దోచుకుంది. ఆమెపైన ప్రేమ దిన దిన ప్రవర్ధమానమౌతోంది. ఆమె గృహంలో ప్రవేశించటం ఆలస్యమైతే అతను దీప్తిహీను డయేవాడు. ఆమె రాకతో అతని కనులు భాసించేవి. అతని రూపం తేజస్వంతమయేది.

రోజులు గడుస్తున్నాయి. సుదర్శన సౌందర్యాతిశయంతో పూచిన మందారంలా శోభిస్తోంది.

తన మనోభిప్రాయాన్ని సుదర్శనకు ఎలా తెలియజేయాలన్నది అగ్నిదేవునికి పెద్ద సమస్యగా తయారైంది. ఏ రూపంగా ఆమెను చేరగలను, ఏ విధంగా తన ప్రేమను వెల్లడి చేయగలను - అని పదే పదే ఆలోచించసాగాడు. కాలయాపన అతని మనసు నంగీకరించలేదు. అగ్ని ఒక నిర్ణయాని కొచ్చాడు.

ఆనాడు రోజుకన్నా ముందరే అగ్నిగృహంలో ప్రవేశించింది సుదర్శన. ఎదురుగా ఉన్న వ్యక్తిని చూస్తూ భయభ్రాంతురాలైంది. తత్తరపాటుతో అడుగు వెనక్కి వేయబోయింది.

"నువ్వు రోజూ చూస్తున్న అగ్నిహోత్రుణ్ణి నేనే!"

ఆ యువకుని మాటకు ఉలిక్కిపడింది సుదర్శన. సుదర్శనకు ఏమీ అర్థంకాలేదు. తను రోజూ సేవించే పవిత్రమూర్తి ఇతనా? ఆ యువకునివైపు ఒక్కసారి కళ్ళెత్తి చూసింది.

"నా మనసు నీపైన లగ్నమైంది. నిన్ను త్రికరణశుద్ధిగా ప్రేమిస్తున్నాను. రోజూ నువ్వు నన్ను భక్తితో ఆరాధిస్తుంటే రోజూ నేను నిన్ను ప్రేమతో ఆరాధిస్తున్నాను. నీ అడుగుల సవ్వడి నాకు ప్రణయగీతంలా వినిపిస్తోంది. నీ చల్లని చూపులు నా గుండె లోతుల్లో దాక్కుంటున్నాయి. నీ కోసం మన్మథ బాధావేశుణ్ణయ్యాను. నన్ను వివాహం చేసుకో."

అతని వాక్ప్రవాహంలో కొట్టుకుపోతున్నట్టనిపించింది ఆమెకి. సిగ్గుదొంతరలు కమ్ముకొచ్చాయి. ముఖాన చిరుచెమట పోసింది. బుగ్గలు ఎరుపెక్కాయి.

ఈ పరమ పవిత్రమూర్తి తనకోసం ఇంతగా పరితపిస్తున్నాడా? ఎందరో ఇతని అనుగ్రహానికి పాత్రులు కావాలని ప్రాకులాడుతుంటే, ఇతను తన అనుగ్రహం కోసం తనని ప్రార్థిస్తున్నాడా? ఈ పావకుని ధర్మపత్నిగా దేవతలకు నైవేద్యాలు అర్పించే భాగ్యం తనకు కలిగే సమయం నిజంగా ఆసన్నమైందా? సుదర్శన వంచిన తల ఎత్తి, ఆ యువకుని వంక చూసింది.

"వివాహ విషయంలో స్వతంత్రత నాకు లేదు. నా తండ్రి అంగీకారం తీసుకుంటే..." సుదర్శన నోటినుంచి మకరందపు తేటలా జాలువారింది ఆ మాట. అగ్నిదేవుని ముఖం ఆనందంతో వెలిగిపోయింది. ఈమె తనని వ్యతిరేకించటం లేదు. ఈమె తండ్రి అంగీకారం తీసుకోమంటోంది. అగ్నిదేవునికి ఆమె మాట గొప్ప తృప్తి నిచ్చింది.

యజ్ఞదీక్షలో ఉన్నాడు దుర్యోధన మహారాజు. భూసురోత్తముల వేద ఘోషతో మారుమోగుతోంది యజ్ఞవాటిక. దుర్యోధనుడు యజ్ఞ నిర్వహణానంతరం భూదేవతలకు పూజలు చేస్తున్నాడు. కానుకలు సమర్పిస్తున్నాడు. దానాలు అందిస్తున్నాడు. దూరంగా అంతా గమనిస్తున్నాడు అగ్ని. బ్రాహ్మణ రూపంలో దుర్యోధనుని సమీపించాడు.

యువకుని సాదరంగా ఆహ్వానించాడు దుర్యోధన ప్రభువు.

"నాకు కన్యాదానం చేయి."

ఆ యువకుని గొంతు విని విస్తుపోయాడు మహారాజు. ఆ యువకుని పరిశీలనగా చూశాడు. అతని శరీర దారుఢ్యం, రూపరేఖలు, ముఖంలో వర్చస్సు, అతని వాక్చమత్కృతి అన్నీ దుర్యోధనునికి నచ్చాయి. కానీ, తాను క్షత్రియుడు. ఈ వర్ణాంతర వివాహాన్ని ఎలా అంగీకరిస్తాడు? ధర్మ వ్యతికరణం తను చేయలేడు. దుర్యోధనుడు ఎంత ఆలోచించినా అభిప్రాయం మారేటట్లు లేదు.

"అయ్యా, వర్ణాంతర వివాహాన్ని నేను చేయలేను. తమరు అన్యథా తలచవద్దు."

దుర్యోధనుని మాటలు అశనిపాతాలైనాయి అగ్నికి.

తానుగా వచ్చి కన్య నభ్యర్థిస్తే ఈ రాజు తనని తిరస్కరిస్తున్నాడనే భావం అతని మనసుని గుచ్చుకుంది. సుదర్శనపై తన ప్రేమను కాదనుకోలేడు.

అక్కడి నుంచి కదిలాడు అగ్నిహోత్రుడు. కానీ, యజ్ఞవాటికలో తన కాంతిని ఉపసంహరించాడు. అంతవరకు ప్రజ్వరిల్లుతున్న అగ్ని ఒక్కసారిగా కాంతి విహీనమవటంతో కారణం తెలియని దుర్యోధనుని మనసు ఆవేదన చెందింది. ఋత్విజులంతా ఎక్కడ ఏ పొరపాటు జరిగిందోనని భయపడి పోయారు.

అగ్నిదేవుని తిరిగి ఆవాహనం చేశారు. భక్తి శ్రద్ధలతో స్తుతించారు. ప్రదక్షిణలు చేశారు.

తనను పూజించే భూసురులకు తన బాధ చెప్పుకోవాలనిపించింది అగ్నికి ఆ సమయంలో. తన ప్రేమ పవిత్రమైందని, తను సుదర్శనను కోరి ఇక్కడికి వచ్చానని అక్కడి వారితో మనవి చేసుకున్నాడు అగ్ని మరొక మార్గం లేక.

దుర్యోధన మహారాజు మనసు తేలికపడింది. సాక్షాత్తు అగ్నిదేవుడే తన కుమార్తెను ప్రేమించి వివాహం చేసుకుంటానని వస్తే, తనకు అంతకుమించిన అదృష్టమేది? తను చేసిన యజ్ఞం ఈ విధంగా ఫలించిందని సంతసించాడు దుర్యోధనుడు.

సుదర్శనాగ్నిహోత్రుల వివాహం వైభవోపేతంగా జరిగింది. *

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్రమహాభారతం :
అనుశాసనిక పర్వం : ప్రథమాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక :9-3-1988)

కథా నిలయం
4974
శ్రీకాకుళం